విశ్వంభర V3 NEWS

ఘనంగా కుమ్మరుల తొలి బోనం జాతర

విశ్వంభర, ముషీరాబాదు : కుమ్మరుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి, గవర్నర్ కోటాలో శాసనమండలికి అవకాశం కల్పించడంతో పాటు కుమ్మరుల కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని, ఉప్పల్ బగాయత్‌లో కుమ్మరులకు కేటాయించిన స్థలంలో ప్రభుత్వం భవనాన్ని నిర్మించి ఇవ్వాలని తెలంగాణ రాష్ట్ర కుమ్మర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నడికుడ జయంత్ రావు డిమాండ్ చేశారు.హైదరాబాదు లోయర్ ట్యాంక్‌బండ్ వద్ద గురువారం తెలంగాణ రాష్ట్ర కుమ్మర సంఘం ఆధ్వర్యంలో కుమ్మరుల తొలి బోనం జాతర భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో కుమ్మర సంఘం నాయకులు, మహిళలు, యువత పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్ ముఖ్య అతిథులుగా హాజరై కుమ్మర సమాజానికి ప్రభుత్వం సముచిత గౌరవం కల్పిస్తుందని, వారి సమస్యలను దశలవారీగా పరిష్కరించేందుకు కట్టుబడి ఉందని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ కుమ్మరుల సమస్యల సాధన కోసం ఐక్యంగా పోరాటం చేయాలని, ప్రభుత్వం గుర్తించే విధంగా జన సమీకరణతో భారీ సమావేశాన్ని నిర్వహించాలని సూచించారు. రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్య కుమ్మరుల సంక్షేమానికి ప్రత్యేక చర్యలు చేపట్టాలని కోరగా, బీసీ సంఘం నేత జాజుల శ్రీనివాస్ గౌడ్ కుమ్మరుల హక్కుల సాధనకు సంఘటిత ఉద్యమమే విజయానికి మార్గమని అన్నారు. అనంతరం మహిళలు పెద్ద ఎత్తున సంప్రదాయ బోనాలతో భారీ ర్యాలీ నిర్వహించారు. లోయర్ ట్యాంక్ బండ్ నుంచి ప్రారంభమైన ర్యాలీ కవాడిగూడ కట్ట మైసమ్మ ఆలయం వరకు కొనసాగింది. భక్తిశ్రద్ధల మధ్య అమ్మవారికి బోనాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ర్యాలీలో సంప్రదాయ డప్పు వాయిద్యాలు, సాంస్కృతిక ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ కార్యక్రమంలో బోనాల కన్వీనర్ ఆడాల గణేష్, రాష్ట్ర కార్యదర్శి నాగపురి నాగేష్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్కాజ్గిరి దయానంద్, రాష్ట్ర కోశాధికారి ఆమంచి రాజలింగం, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఏడుకొండల వెంకటేశం నరసింహ, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని ఏబీవీపీ నిరసన

విశ్వంభర, హుస్నాబాద్ : అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) హుస్నాబాద్ శాఖ ఆధ్వర్యంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని ఎత్తివేయాలనే ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ స్థానిక అంబేద్కర్ చౌరస్తాలో ముఖ్యమంత్రి చిత్రపటానికి రక్తవర్ణం తో అభిషేకం చేస్తూ వినూత్న నిరసన చేపట్టారు. “మా రక్తం కూడా ఇస్తున్నాం... మా ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలి” అంటూ విద్యార్థులు నినాదాలు చేశారు.ఈ సందర్భంగా ఏబీవీపీ స్టేట్ వర్కింగ్ కమిటీ సభ్యుడు, మెదక్ విభాగ్ కన్వీనర్ సావుల ఆదిత్య మాట్లాడుతూ, రాష్ట్రంలో లక్షలాది మంది విద్యార్థులు ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లపై ఆధారపడి ఉన్నత విద్యను అభ్యసిస్తున్నారని అన్నారు. ప్రభుత్వం బకాయిలను విడుదల చేయడంలో నిర్లక్ష్యం వహించడంతో వేల కోట్ల రూపాయల బకాయిలు పేరుకు పోయాయని ఆరోపిం చారు.ఫీజు రీయిం బర్స్‌మెంట్ పథకాన్ని నిర్వీర్యం చేసే ప్రయ త్నాలు పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థుల భవిష్యత్తును దెబ్బతీస్తాయని పేర్కొ న్నారు. బకాయిలు చెల్లించకపోవడంతో విద్యార్థులు సర్టిఫికెట్లు పొందలేక, చదువులు మధ్యలోనే నిలిపివేయాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు విద్యార్థుల హక్కులేనని, అవి ప్రభుత్వం ఇచ్చే దానం కాదని స్పష్టం చేశారు. ప్రభుత్వం వెంటనే పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేసి, విద్యార్థుల భవిష్యత్తును కాపాడాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని మరింత ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో జిల్లా హాస్టల్ కన్వీనర్ రాజేష్, నగర ఉపాధ్యక్షుడు సంతోష్, అంజి, నగర సంయుక్త కార్యదర్శి రంజిత్‌తో పాటు ఏబీవీపీ నాయకులు, పాల్గొన్నారు.

హిందువులందరూ ఐకమత్యంగా సంఘటితమై ఉండాలి

: ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి

విశ్వంభర, ఆర్మూర్ : హిందువుల పై దాడులు జరిగితే హిందువులందరూ ఐకమత్యంగా సంఘటితమై కలిసికట్టుగా ఉద్యమిస్తేనే భవిష్యత్తు ఉంటుందని ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి అన్నారు. నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ మున్సిపల్ పట్టణ కేంద్రంలోని పెర్కిట్ – కోటార్మూర్ చౌరస్తా వద్ద ఇస్కాన్ వారి జగన్నాథ రథయాత్రను గురువారం ఆర్మూర్ మున్సిపల్ చైర్ పర్సన్ గోనే లహరి రఘుతో కలిసి ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి ప్రారంభించారు. ఈమధ్య హిందువుల పై దాడులు జరిగితే వ్యాపారస్తులు దుకాణాలను మూసి ఆందోళనలో పాల్గొనలేదని చెప్పారు. పిప్రిలో హిందువు ఇంటిని దగ్ధం చేస్తే స్పందించలేదని పేర్కొన్నారు. చెంప దెబ్బ కొట్టినందుకు ఒక వర్గం వారు వందల సంఖ్యలో వచ్చారని, హిందువులు సైతం ఇంటికొకరు చొప్పున తరలి వచ్చి రాబోయే రోజుల్లో సత్తాచూపాలన్నారు. ఇండ్లు, దుకాణాల నుంచి బయటకు రానట్లయితే రాబోయే రోజుల్లో హిందువుల పరిస్థితి దారుణంగా ఉంటుందన్నారు. బటెంగేతో కటేంగే కాబట్టి హిందూ సంస్థలు ఆందోళనకు పిలుపునిస్తే హిందూ బంధువులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి పిలుపు నిచ్చారు. లేనట్లయితే హిందువులైన మన పై దాడులు జరిగినప్పుడు ఇతర హిందువులు రారన్నారు. ఆర్మూర్ లో ఇస్కాన్ మందిర నిర్మాణానికి 5 ఎకరాల స్థలం కేటాయిస్తున్నట్లు వెల్లడించారు. మున్సిపల్ చైర్ పర్సన్ ఈ ఫైల్ పై సంతకం చేస్తే ఆ స్థలంలో భవ్య మందిరం నిర్మాణం అవుతుందన్నారు. హిందువుల పై దాడులు చేస్తే ఇకనుంచి సహించేది లేదని హెచ్చరించారు. అనంతరం జగన్నాథ రథయాత్ర త్రాడును లాగి యాత్రను ప్రారంభించారు. అనంతరం ఆర్మూర్ మున్సిపల్ చైర్ పర్సన్ గోనె లహరి రఘు మాట్లాడారు. ఇస్కాన్ జగన్నాథ రథోత్సవంలో పాల్గొనడం నా అదృష్టంగా భావిస్తున్నట్లు చెప్పారు. తరువాత ఈ ఆర్ ఫౌండేషన్ చైర్మన్ ఈరవత్రి రాజశేఖర్ మాట్లాడారు. జగన్నాథుని రథోత్సవంలో హిందువులు భారీ సంఖ్యలో పాల్గొని హిందువుల ఐక్యతను చాటడం గొప్ప విషయం అన్నారు. జగన్నాథుని కృపతో వర్షాలు కురిసి రైతులకు సమృద్ధిగా పంటలు పండాలని ఈరవత్రి రాజశేఖర్ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సాయిబాబా గౌడ్, మున్సిపల్ మాజీ చైర్పర్సన్ పండిత్ వినీత పవన్, ఈ ఆర్ ఫౌండేషన్ చైర్మన్ ఈరవత్రి రాజశేఖర్, బీజేపీ మాజీ జిల్లా అధ్యక్షుడు పెద్దల గంగారెడ్డి, కౌన్సిలర్ లు , ఇస్కాన్ సభ్యులు పాల్గొన్నారు.

11వ వార్డులో ఉచిత కంటి పరీక్షల శిబిరం

56 మందికి కంటి పరీక్షలు.. ఏడుగురికి ఉచిత ఆపరేషన్లు

విశ్వంభర, హుస్నాబాద్: ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో హుస్నాబాద్ పట్టణంలోని 11వ వార్డులో ఉచిత కంటి పరీక్షల శిబిరం నిర్వహించారు. వార్డు కౌన్సిలర్ పూదరి వరప్రసాద్ గౌడ్ ఆధ్వర్యంలో శరత్ మ్యాక్స్ విజన్ సహకారంతో ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో 56 మందికి కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వైద్య సలహాలు అందించారు. డాక్టర్ మోరే సందీప్ కుమార్, ఆప్తమాలజిస్ట్ అనూష, సీహెచ్‌డబ్ల్యూ సదానందం ఆధ్వర్యంలో పరీక్షలు నిర్వహించగా, శస్త్రచికిత్స అవసరమైన ఏడుగురికి ఉచితంగా కంటి ఆపరేషన్లు చేపడతామని వైద్య బృందం తెలిపింది.ఈ సందర్భంగా కౌన్సిలర్ పూదరి వరప్రసాద్ గౌడ్ మాట్లాడుతూ, కంటి సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా ప్రతి ఒక్కరూ సకాలంలో పరీక్షలు చేయించుకోవాలని, ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ దండి లక్ష్మి, వైస్ చైర్‌పర్సన్ చిత్తారి పద్మ, కమిషనర్ టి. మల్లికార్జున్, కౌన్సిలర్లు చెన్నబోయిన అనూష, బూరుగు లత, కొండ రజిత, పిల్లి తిరుపతి, బొలిశెట్టి రాజు, కేశవేణి రమేష్, బొల్లి శ్రీనివాస్, వైద్యం కిరణ్, గాదెపాక రవీందర్, బత్తుల స్వరూప, గోపగోని శోభన్, కో-ఆప్షన్ సభ్యుడు ఎండీ హసన్‌తో పాటు శరత్ మ్యాక్స్ విజన్ అసిస్టెంట్ మేనేజర్ ముసిపట్ల సాగర్, వార్డు ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

సహకార సంఘాల రుణాలను సద్వినియోగం చేసుకోవాలి



విశ్వంభర, పరిగి: పట్టణంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో పిఎసిఎస్ ఆధ్వర్యంలో పరిగి మండలంలోని పలు గ్రామాలకు చెందిన రైతులకు సుమారు రూ.45 లక్షల 60 వేల విలువైన గోల్డ్ లోన్ ఎల్ టి లోన్ రుణ చెక్కులను పరిగి ఎమ్మెల్యే, టీపీసీసీ ట్రైనింగ్ కమిటీ చైర్మన్ డాక్టర్ టి.రామ్మోహన్ రెడ్డి స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులతో కలిసి పంపిణీ చేశారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో రైతుల కోసం ఏర్పాటు చేసిన వ్యవసాయ డ్రోన్ సేవలను ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి మాట్లాడుతూ.. ఆధునిక వ్యవసాయ సాంకేతికతను రైతులు సద్వినియోగం చేసుకొని తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించాలని, డ్రోన్ సేవలను విస్తృతంగా వినియోగించుకోవాలని రైతులకు సూచించారు. రైతులకు అవసరమైన సమయంలో సులభంగా రుణాలు అందించడం ద్వారా వారి వ్యవసాయ కార్యకలాపాలకు ఆర్థికంగా బలాన్నిచ్చే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు.సహకార సంఘాల ద్వారా రైతులకు మరింత మెరుగైన సేవలు అందేలా కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. రైతులు అందిస్తున్న రుణాలను సద్వినియోగం చేసుకుని వ్యవసాయాభివృద్ధికి వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల పిఎసిఎస్ చైర్మన్ సిద్ధాంతి పార్థసారథి, వైస్ చైర్మన్ రాజ పుల్లారెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ రజిత వెంకటేష్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సయ్యద్ అయ్యూబ్, మండల కాంగ్రెస్ అధ్యక్షులు వెంకట్ రాములు, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు రామకృష్ణారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ హనుమంతు, పిఎసిఎస్ సభ్యులు సత్యనారాయణ రెడ్డి, రవి కాంత్ రెడ్డి, వెంకటేష్, నాగవర్ధన్, కౌన్సిలర్లు ఆరిఫ్, పాల్గొన్నారు.

నకిలీ ఓట్లను తొలగించాలి

ఇబ్రహీంపట్నం ఆర్డీఓకు బీఆర్ఎస్వీ వినతిపత్రం

విశ్వంభర, ఇబ్రహీంపట్నం: రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం నియోజకవర్గ పరిధిలోని పెద్ద అంబర్‌పేట్, తుర్కయంజాల్ మున్సిపాలిటీల ఓటర్ల జాబితాల్లో తీవ్ర అవకతవకలు చోటుచేసుకున్నాయని బీఆర్ఎస్వీ ఇబ్రహీంపట్నం నియోజకవర్గ అధ్యక్షుడు నిట్టు జగదీశ్వర్ ఆరోపించారు. ఈ మేరకు గురువారం ఇబ్రహీంపట్నం ఆర్డీఓ శ్రీనివాస్‌రెడ్డిని కలిసి సంబంధిత వివరాలతో కూడిన వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆయా మున్సిపాలిటీల ఓటర్ల జాబితాల్లో పెద్ద సంఖ్యలో నకిలీ, డూప్లికేట్, నివాసేతర ఓటర్లు నమోదు అయినట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఒకే ఇంటి నంబర్‌పై అసాధారణంగా అధిక సంఖ్యలో ఓటర్లు నమోదైన ఘటనలు గుర్తించినట్లు తెలిపారు. వాస్తవానికి ఆ చిరునామాల్లో నివసించని వ్యక్తుల పేర్లు కూడా ఓటర్ల జాబితాలో నమోదైనట్లు అనుమానాలు ఉన్నాయని పేర్కొన్నారు. కొంతమంది కాంగ్రెస్ పార్టీకి చెందిన స్థానిక నాయకులు నకిలీ లేదా కల్పిత నివాస ధ్రువీకరణ పత్రాలను ఉపయోగించి, అనర్హులైన వ్యక్తులను ఓటర్లుగా నమోదు చేయించారని, కళాశాల విద్యార్థుల గుర్తింపు కార్డులను వినియోగించి ఓటరు నమోదు ప్రక్రియకు సహకరించినట్లు తమకు సమాచారం అందిందని ఆరోపించారు. ఈ ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెలికితీయాలని ఆయన కోరారు. విచారణలో ఈ ఆరోపణలు నిజమని తేలితే, ఇటువంటి చర్యలు ఓటర్ల జాబితాల విశ్వసనీయతను దెబ్బతీయడమే కాకుండా ప్రజాస్వామ్య ఎన్నికల ప్రక్రియపై కూడా తీవ్ర ప్రభావం చూపుతాయని పేర్కొన్నారు.ఈ నేపథ్యంలో పెద్ద అంబర్‌పేట్, తుర్కయంజాల్ మున్సిపాలిటీల పరిధిలో ఓటర్ల జాబితాలపై క్షేత్రస్థాయిలో ఇంటింటి తనిఖీలు నిర్వహించాలని, ఒకే ఇంటి నంబర్‌పై నమోదైన ఓటర్ల వివరాలను పూర్తిగా ధ్రువీకరించాలని వినతిపత్రంలో కోరారు. అలాగే నకిలీ, డూప్లికేట్, నివాసం మార్చిన, మరణించిన, ప్రవాస ఓటర్లను గుర్తించి ఓటర్ల జాబితా నుంచి తొలగించే చర్యలు తీసుకోవాలని ఆర్డీఓను విజ్ఞప్తి చేశారు. ప్రజా స్వామ్య వ్యవస్థపై ప్రజల్లో విశ్వాసం నిలబెట్టాలంటే ఓటర్ల జాబితాలు పూర్తిగా పారదర్శకంగా, తప్పులు లేకుండా ఉండాల్సిన అవసరం ఉందని నిట్టు జగదీశ్వర్ పేర్కొన్నారు.

రాగన్నగూడ జిల్లా పరిషత్ పాఠశాలను సందర్శించిన ఎలిమినేటి నరసింహారెడ్డి

విశ్వంభర, ఇబ్రహీంపట్నం: తుర్కయంజాల్ బిజెపి మున్సిపల్ అధ్యక్షులు ఎలిమినేటి నరసింహారెడ్డి గురువారం రాగన్నగూడ జిల్లా పరిషత్ పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులతో ముఖాముఖి మాట్లాడి పాఠశాలలో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తరగతి గదులు, మరుగు దొడ్లు, తాగునీరు, ఆటస్థలం వంటి మౌలిక వసతుల గురించి వివరాలు సేకరించారు. విద్యార్థులకు మెరుగైన విద్యతో పాటు అన్ని సౌకర్యాలు కల్పించడం మున్సిపాలిటీ ప్రధాన బాధ్యత అని పేర్కొన్నారు. పాఠశాలలో మౌలిక వసతుల కల్పన కోసం తన వంతు కృషి చేస్తామని ఉపాధ్యాయులు, విద్యార్థులకు హామీ ఇచ్చారు. త్వరలోనే సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించి నిధులు మంజూరు చేయించి సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్‌లో వేడుకగా జగన్నాథస్వామి రథయాత్ర

విశ్వంభర, హైదరాబాద్: బంజారాహిల్స్ రోడ్డు నంబరు 12లో ఉన్న ప్రసిద్ధ జగన్నాథస్వామి ఆలయంలో రథయాత్ర వైభవంగా కొనసాగుతోంది. ఈ యాత్రలో భాగంగా జగన్నాథుడు, బలభద్రుడు, సుభద్రల ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించిన రథాలపై ఊరేగింపు చేపట్టారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. నగరంలో మరో చోట జగన్నాథ రథయాత్ర జరిగింది. ఎన్టీఆర్ స్టేడియం రోడ్డు నుంచి అశోక్ నగర్, హిమాయత్ నగర్, అబిడ్స్ మీదుగా నాంపల్లి గ్రౌండ్ వరకు సాగిన ఈ రథయాత్రలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు

బాధిత కుటుంబాలకు మబ్బు అబ్బాస్ ఫౌండేషన్ అండ

రూ.10,032 ఆర్థిక సాయం అందజేత

విశ్వంభర, గుండాల: “మానవసేవే మాధవసేవ” అనే లక్ష్యంతో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న మబ్బు అబ్బాస్ ఫౌండేషన్ మరోసారి తన సేవా దృక్పథాన్ని చాటుకుంది. గుండాల మండలంలోని నూనెగూడెం, తుర్కల షాపురం గ్రామాల్లో ఇటీవల కుటుంబ పెద్దలను కోల్పోయిన రెండు బాధిత కుటుంబాలను ఫౌండేషన్ చైర్మన్ మబ్బు మహేష్ పరామర్శించి, ఒక్కో కుటుంబానికి రూ.5,016 చొప్పున మొత్తం రూ.10,032 ఆర్థిక సాయం అందజేశారు. నూనెగూడెం గ్రామానికి చెందిన అండెం స్వరూప అనారోగ్యంతో మృతి చెందడంతో వారి కుటుంబ సభ్యులను పరామర్శించిన మబ్బు మహేష్, ఫౌండేషన్ తరపున ఆర్థిక సహాయం అందజేయడంతో పాటు అంత్యక్రియల్లో పాల్గొని ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. అదేవిధంగా తుర్కల షాపురం గ్రామానికి చెందిన పాలోజు సత్యనారాయణ విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందడంతో, వారి కుటుంబాన్ని పరామర్శించి ఫౌండేషన్ తరపున రూ.5,016 ఆర్థిక సహాయం అందజేశారు. కుటుంబానికి ఈ క్లిష్ట సమయంలో అండగా ఉంటామని భరోసా కల్పించారు. ఈ సందర్భంగా మబ్బు మహేష్ మాట్లాడుతూ, ఆపదలో ఉన్న కుటుంబాలకు తోడుగా నిలవడం ఫౌండేషన్ ప్రధాన లక్ష్యమని అన్నారు. భవిష్యత్తులో కూడా అవసరమైన వారికి తమ సేవా కార్యక్రమాలను మరింత విస్తరించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజాప్రతినిధులు, మబ్బు అబ్బాస్ ఫౌండేషన్ మండల ఇన్‌చార్జులు మల్లెపాక పరశురాములు, గొల్లపల్లి సురేష్, సభ్యులు అల్వాల రాజు, పాలడుగు భరత్, అల్వాల పరశురాములు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

రోటరీ క్లబ్ అధ్యక్షుడు దూదికట్ల సత్యంకు ఆత్మీయ సత్కారం

విశ్వంభర, కురవి: మహబూబాబాద్ రోటరీ క్లబ్ అధ్యక్షుడిగా కురవి గ్రామానికి చెందిన దూదికట్ల సత్యం ఎన్నికైన సందర్భంగా ఆయనను స్వగ్రామంలో ఘనంగా సత్కరించారు. కురవిలోని ఆయన నివాసంలో నిర్వహించిన కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, జర్నలిస్టులు, సామాజిక నాయకులు పాల్గొని శాలువాతో సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టీయూడబ్ల్యూజే--ఐజేయూ) మహబూబాబాద్ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ శ్రీనివాస్, బీఆర్ఎస్ కురవి మండల నాయకుడు, మాజీ గ్రామపంచాయతీ వార్డు సభ్యుడు నూతక్కి నరసింహారావు, టీయూడబ్ల్యూజే (ఐజేయూ) కురవి మండల అధ్యక్షుడు గుంటి సురేష్, నమస్తే తెలంగాణ కురవి మండల ప్రతినిధి సంగెం నాగరాజు, సత్యం తండ్రి, సీపీఐ పార్టీ కురవి మండల సీనియర్ నాయకుడు దూదికట్ల సారయ్య తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా టీయూడబ్ల్యూజే (ఐజేయూ) మహబూబాబాద్ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ శ్రీనివాస్ మాట్లాడుతూ, మధ్యతరగతి కుటుంబం నుంచి అంచెలంచెలుగా ఎదుగుతూ సమాజంలో మంచి గుర్తింపు, గౌరవం సంపాదించిన సత్యం మరింత ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. రోటరీ క్లబ్ అధ్యక్షుడిగా సమాజ సేవకు ప్రాధాన్యం ఇస్తూ, అవసరమైన వారికి అండగా నిలిచి సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహించాలని సూచించారు. సత్కారానికి స్పందించిన దూదికట్ల సత్యం తనపై నమ్మకం ఉంచి అధ్యక్ష బాధ్యతలు అప్పగించిన రోటరీ క్లబ్ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. సమాజ సేవే తన ప్రధాన లక్ష్యమని, రోటరీ క్లబ్ ద్వారా విద్య, వైద్యం, సామాజిక సేవా కార్యక్రమాలకు మరింత ప్రాధాన్యం ఇస్తానని పేర్కొన్నారు.

వడ్డెర సంఘం సమస్యల పరిష్కారానికి రాజకీయ కృషి చేయాలి

: రాష్ట్ర అధ్యక్షురాలు కుంచపు రమ

విశ్వంభర, జగద్గిరిగుట్ట: జగద్గిరిగుట్ట వడ్డెర సంఘం అధ్యక్షుడు యాదగిరి పిలుపు మేరకు గురువారం నిర్వహించిన వడ్డెర సంఘం ముఖ్య సమావేశానికి అఖిల భారత వడ్డెర సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు, మెడిటేషన్ గురువు కుంచపు రమ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సమావేశాన్ని ఉద్దేశించి ఆమె మాట్లాడుతూ, వడ్డెర కులానికి చెందిన ప్రజలను రాజకీయ నాయకులు కేవలం ఓట్ల కోసమే కాకుండా వారి సామాజిక, ఆర్థిక సమస్యలను పరిష్కరించే దిశగా చిత్తశుద్ధితో కృషి చేయాలని కోరారు. అన్ని రాజకీయ పార్టీల్లో ఉన్న ప్రజాప్రతినిధులు, నాయకులు వడ్డెర సంఘం సభ్యులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను గుర్తించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ముఖ్యంగా రాళ్లు కొట్టే కూలీలు తీవ్ర ఆర్థిక, ఉపాధి సమస్యలను ఎదుర్కొంటున్నారని, వారి సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. వడ్డెర కులానికి చెందిన కుటుంబాల అభివృద్ధి, ఉపాధి అవకాశాల కల్పన, సంక్షేమ పథకాల అమలు విషయంలో ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టి సారించాలని ఆమె కోరారు. వడ్డెర సంఘం ఐక్యంగా పనిచేస్తూ తమ హక్కుల సాధన కోసం పోరాటం కొనసాగించాలని, సంఘ సభ్యులందరూ సమిష్టిగా ముందుకు రావాలని కుంచపు రమ పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో వడ్డెర సంఘం నాయకులు, సభ్యులు, మహిళలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో యూనిఫారాలు, పౌష్టికాహారం వెంటనే అందించాలి

విశ్వంభర, రామన్నపేట: పాఠశాలలు ప్రారంభమై రెండు నెలలు గడిచినా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఇప్పటికీ యూనిఫారాలు అందకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మేక అశోక్ రెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు జల్లెల పెంటయ్య విమర్శించారు. యాదాద్రి భువనగిరి జిల్లా, రామన్నపేట మండలం, ఇస్త్రిల్ల గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను సందర్శించి విద్యార్థులు, ఉపాధ్యాయులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. పేద, మధ్య తరగతి కుటుంబాల విద్యార్థులకు యూనిఫారాలు, పాఠ్యపుస్తకాలు, అవసరమైన సామగ్రిని సకాలంలో అందించాలని కోరారు. మధ్యాహ్న భోజనంలో నాణ్యమైన పౌష్టికాహారం, గుడ్లు, పండ్లు, ఆకుకూరలు, పప్పు, పాలు ప్రభుత్వ నిబంధనల ప్రకారం అందించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు, మౌలిక సదుపాయాలు మెరుగుపర్చాలని కోరుతూ, సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి బొడ్డుపల్లి వెంకటేశం, వ్యకాస నాయకులు బల్గురి అంజయ్య, రైతు సంఘం మండల కార్యదర్శి, మాజీ సర్పంచ్ గన్నేబోయిన విజయభాస్కర్, సీఐటీయు మండల కార్యదర్శి గొరిగే సోములు, నాయకులు గంటెపాక శివ కుమార్, మేడబోయిన శ్రీనివాస్, నీల ఐలయ్య, అప్పం సురేందర్, పల్లె సత్యం తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్, బి ఆర్ఎస్ పార్టీల నుంచి బిజెపిలో చేరిక

విశ్వంభర, నెల్లికుదురు: భారతీయ జనతా పార్టీలోకి నెల్లికుదురు మండలంలోని వివిధ గ్రామాల కు చెందిన కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీల నుంచి గురువారం భారీగా చేరారు. వీరికి ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్.గౌతమ్ రావు,మాజీ ఎంపీ సీతారాం నాయక,జిల్లా అధ్యక్షులు వల్లబు వెంకటేశ్వర్లు, మండల అధ్యక్షులు చందు రాజ్ కుమార్ యాదవ్ ప్రభృతులు బిజెపి కండువా కప్పి ఆహ్వానించారు. నరసింహుల గూడెం లో బిజెపి ఎస్సీ మోర్చా జిల్లా సెక్రటరీ జల్లి రమేష్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ బిఆర్ఎస్ పార్టీలకు చెందిన పలువురు బిజెపిలో చిరగా వీరి వెంట నవీన్ బాలకృష్ణ లు ఉన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతమ్ రావు మాట్లాడుతూ ప్రధానమంత్రి అవినీతి రహిత పాలన, అభివృద్ధి, దార్శనికత చూసి అన్నిచోట్ల బిజెపిలో అనేక మంది చేరుతున్నట్లు తెలిపారు.కార్యక్రమంలో కళ్యాణ్ నాయక్, మదన్ లాల్,నల్లాని పాపారావు,పర్నె ప్రభాకర్ రెడ్డి, యాకిరెడ్డి,ముస్తఫా,తోట రమేష్,దుస్స యాకయ్య,తదితర నాయకులు పాల్గొన్నారు.